క్లుప్తంగా

వైభవంగా భావనాఋషి కల్యాణం



చెరుకుపల్లి: గుళ్లపల్లి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ భద్రావతి సమేత శ్రీ భావనాఋషి స్వామివారి కల్యాణాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ నెల 14నుంచి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రతి రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు బ్రహ్మశ్రీ ఆనివేళ్ళ సుబ్రమణ్యం శర్మ నిర్వహించారు. పద్మశాలీయ బహూత్తమ సంఘం వారిచే అన్న సమారాధన, రాత్రి 8 గంటలకు కర్పూర మంగళ హారతి, పవళింపు సేవలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పద్మశాలీయ బహూత్తమ సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నగరం తహసీల్దార్‌గా శ్రీశిల్ప



నగరం: నగరం తహసీల్దార్‌గా శ్రీశిల్ప శనివారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా నగరం తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎం ప్రమీల స్థానంలో సీఆర్‌డీఏలో పని చేస్తున్న శ్రీశిల్పను నియమించడంతో ఆమె విధుల్లో చేరారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన శ్రీశిల్పకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

25న జిల్లా పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక

కొల్లూరు : ఉమ్మడి గుంటూరు జిల్లా సీనియర్స్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపికను ఈ నెల 25న కొల్లూరు బాలురోన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ డి.నెల్లిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కబడ్డీ అసోసియేషన్ తరపున నిర్వహించనున్న పోటీలలో రాష్ట్ర స్థాయి పోటీలలో గుంటూరు జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహించదలచిన క్రీడాకారులు 25న జరగనున్న సెలక్షన్ ప్రక్రియలో తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు మార్చి 8 నుంచి 10 వరకు నెల్లూరు జిల్లా కొవ్వూరులో జరిగే 70వ అంతర్ జిల్లా పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

20 నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లోని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక పోస్టర్‌లను శనివారం ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. 20న స్వామివారిని పెళ్లి కుమారుడు చేయుట, 21న సీతారాముల కల్యాణం, 22న సూర్యప్రభ వాహన సేవ, రాత్రి చంద్రప్రభ వాహన సేవ, 23న శ్రీమైనాక వాహన సేవ రాత్రి గజవాహన, గరుడ వాహన సేవ ఉంటుందన్నారు. రాత్రి సువర్చలా హనుమత్ కల్యాణం, 24న మధ్యాహ్నం శ్రీవారి రథోత్సవం, 25న చక్ర స్నానం, పూర్ణాహుతి, 26న ఉదయం పుష్పోత్సవం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసమూర్తి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలను ఉపయోగించుకోండి



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ సేవలను అందరూ ఉపయోగించుకోవాలని ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి కోరారు. పినపాడులోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ల్యాబ్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట ల్యాబ్ టెక్నీషియన్ కమలాకర్ గుప్తా ఉన్నారు.

రోగులకు రొట్టెల పంపిణీ

తెనాలి: స్థానిక పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ముంబయి) తరపున రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. కౌన్సిల్ కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు, నన్నపనేని సునీల్, వసంతం పవన్‌కుమార్, హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ బి.బి.జాను, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం అర్బన్ హెల్త్ సెంటర్ పనితీరును అడిగి తెలుసుకుని, అక్కడి వైద్య పరికరాలు, ల్యాబ్‌ను సందర్శించారు. నాగరాజు మాట్లాడుతూ అర్బన్ హెల్త్ సెంటర్‌లో 9 రకాల వైద్య సేవలు, 64 రకాల పరీక్షలు చేస్తుండటాన్ని అభినందించారు. విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి ముఖ్యమని చెబుతూ తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సారథ్యంలో ఆయా రంగాల్లోని ప్రగతిని ప్రశంసించారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

హైకోర్టు జడ్జి రామకృష్ణ ప్రసాద్



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి రామకృష్ణ ప్రసాద్

రేపల్లె రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో గమ్యాలను చేరుకోవాలని హైకోర్టు జడ్జి జి.రామకృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని చాట్రగడ్డలోని ఎస్‌వీఎస్ శ్రీ సరస్వతీ విద్యామందిర్‌ను శనివారం ఆయన సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. చదువుతో పాటు అన్నిరంగాలలో విద్యార్థులు ప్రావీణ్యం సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులే రోల్‌మోడల్‌గా ఉంటారని, ఉపాధ్యాయులు అంకిత భావంతో బోధన చేయాలన్నారు. రేపల్లె సబ్‌కోర్టు జడ్జి వెంకటేశ్వర్లు, జూనియర్ సివిల్ జడ్జి ఎల్.జగదీష్ బాబు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రూపశ్రీ, డీఎస్పీ మురళీకృష్ణ, హెచ్‌ఎం కొల్లా దశపతిరావు, సరస్వతి విద్యాపీఠం సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సంక్షేమానికి తొలి ప్రాధాన్యం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈవూరి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఈవూరి గణేష్

రేపల్లె రూరల్: రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ పాలనను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. సిద్ధం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బొందలగరువు పంచాయతీలోని చలపాటివారిపాలెం, వాకావారిపాలెం, వీరయ్యవారిపాలెం గ్రామాలలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించి మాట్లాడారు. పేదలను అన్ని రంగాలలో ముందుంచాలన్న లక్ష్యంతో జగనన్న విద్యారంగంలో, వైద్యరంగంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. నాడు-నేడు పేరుతో విద్యారంగాన్ని ప్రక్షాళన చేశారని, కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖల్ని మార్చటంతో పాటు ఆంగ్ల మాధ్యమాన్ని విద్యార్థులకు అందిస్తున్నారన్నారు.జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో గ్రామ గ్రామాన, వాడవాడలా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్యాన్ని ప్రజల ముంగిటకే తీసుకువచ్చారన్నారు. జగనన్న వలంటీర్ల దళం సైతం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకునేందుకు నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

పిట్టలవానిపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని మండల విద్యాశాఖాధికారి ఉయ్యూరి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పిట్టువారిపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరిశ నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని వార్షిక కల్యాణోత్సవాలు

బాపట్ల అర్బన్ : నగరంలో వేంచేసి యున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీనివాస సేవా సమితి, త్యాగరాయ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 24 వరకు వార్షిక కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

గ్రామ దత్తతతో రైతన్నలకు లబ్ధి

డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

బాపట్ల: గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక అభివృద్ధిని పెంచడమే గ్రామ దత్తత కార్యక్రమం ప్రధాన లక్ష్యమని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.వి.శ్రీనివాసరావు అన్నారు. కావూరువారిపాలెం గ్రామ దత్తత ప్రారంభోత్సవ సభలో శనివారం ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమం కోసం నిరంతరం పాటుపడే ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కావూరువారిపాలెం గ్రామాన్ని అభివృద్ధి చేయడం కోసం ఆ గ్రామాన్ని దత్తత తీసుకుందన్నారు. గ్రామ దత్తత కార్యక్రమం ద్వారా రైతులకు పలు ప్రయోజనాలు చేకూరుతాయని, అధునాతన టెక్నాలజీ ద్వారా శాస్త్రీయ వ్యవసాయ నిర్వహణ, నాణ్యమైన విత్తనాల వినియోగం, మరియు ఎరువుల సమతుల్యత వంటి వ్యవసాయ సంరక్షణ విధానాల పట్ల రైతులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం పంటల మెరుగైన ఉత్పత్తికి దోహదపడుతుందన్నారు. రైతుల సమస్యలకు పరిష్కార మార్గాలు కూడా ఈ కార్యక్రమం ద్వారా సూచించ బడతాయన్నారు. వ్యవసాయ కళాశాల విస్తరణ విభాగ అధిపతి డా.ఎం. రమాదేవి, కోఆర్డినేటర్ డా.మండవ శ్రీనివాసరావు, డా. టి. ప్రశాంత కుమార్, వ్యవసాయ అధికారి సుమతి రైతులకు పలు సూచనలు చేశారు. రైతు శిక్షణ కార్యక్రమంలో పశు పోషణలో మెలకువలపై వెటర్నరీ డాక్టర్లు కె.విజయ ప్రకాష్ ,శివారెడ్డి తదితరులు సూచనలిచ్చారు. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి వాటికి తగిన మందులను అందించారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతు రమణారెడ్డి, గ్రామ రైతులు, మహిళా రైతులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

25న జిల్లా కబడ్డీ పురుషుల జట్టు ఎంపిక

చెరుకుపల్లి: ఈ నెల 25న ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ సీనియర్స్ పురుషుల విభాగం ఎంపిక నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డి నెల్లిరెడ్డి శనివారం తెలిపారు. కొల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 25న ఉదయం 9గంటలకు జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక జరుగుతుందని చెప్పారు. ఈ జట్టులో ఎంపికైన క్రీడాకారులు మార్చి 8, 9, 10 తేదీలలో నెల్లూరు జిల్లా కొవ్వూరులో జరిగే 70వ అంతర్ జిల్లా పోటీలలో పాల్గొంటారని చెప్పారు. సెలక్షన్‌కు వచ్చే క్రీడాకారులు 85 కిలోల లోపు బరువు ఉండాలన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ పి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అక్కపై చెల్లి దాడి..

కొల్లిపర: అక్కా చెల్లి గొడవలో అక్కకు గాయాలైన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కొల్లిపర గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు రంపాటి లక్ష్మి, మరిపూడి పద్మ మధ్య గొడవ జరిగింది. లక్ష్మిని తన చెల్లి పద్మ, ఆమె కొడుకు శ్రావణ్‌కుమార్ కర్రతో కొట్టగా తలకు గాయాలయ్యాయి. లక్ష్మిని కుటుంబ సభ్యులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్. రవీంద్రరెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు.

బాలకోటేశ్వరుని తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్

రేపల్లె రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అరవపల్లిలో వేంచేసి యున్న బాలకోటేశ్వర స్వామి తిరునాళ్లను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని తహసీల్దార్ చొప్ప రవీంద్రబాబు సూచించారు. మార్చి 8వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అరవపల్లి బాల కోటేశ్వరస్వామి తిరునాళ్ల నిర్వహణపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. తిరునాళ్లకు పాత గుంటూరు జిల్లాతో పాటు పాత కృష్ణా, ప్రకాశం జిల్లాల నుంచి సైతం అధిక సంఖ్యలో భక్తులు వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. రేపల్లె నుంచి అరవపల్లికి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయటంతో పాటు గ్రామంలో బస్సులను నిలుపుకునేందుకు స్థలాన్ని పరిశీలించాలన్నారు. పోలీసు అధికారులు తిరునాళ్లలో ఎటువంటి అపశృతులు చోటు చేసుకోకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని కోరారు. తిరునాళ్లలో సేవలందించే స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుగా ఆలయ అధికారుల వద్దగానీ, తహసీల్దార్ కార్యాలయంలో గానీ అనుమతులు పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన

తెనాలిటౌన్: తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆధునీకరణలో భాగంగా ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేస్తున్న ఎడ్ల బండి, రైతుల విగ్రహ నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పరిశీలించారు. ఈ నెలాఖరు నాటికి ప్రారంభించే విధంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్, మార్కెట్ కమిటీ నిధులతో ఎడ్ల బండి, రైతు విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి జేవీ సుబ్బారావు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సీత నగేష్ రెడ్డి, పార్టీ నాయకులు బూరెల దుర్గాప్రసాద్, గుదిబండి రమేష్‌రెడ్డి, ఆరిగ చంద్రారెడ్డి, ఉడుముల మహేష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

రేపు నందివెలుగులో పాస్టర్ల సమావేశం

తెనాలిటౌన్: నందివెలుగు ఇందిరా కాలనీలో యెహోవా ఈరే మందిరంలో సోమవారం ఉదయం 8 గంటలకు తెనాలి రూరల్ మండలం పాస్టర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు పాస్టర్ ఎం .బర్నబాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొంటారని, తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన 25 కుటుంబాల సభ్యులు శనివారం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడం పట్ల ఆకర్షితులై పార్టీలోకి చేరినట్లు చెప్పారు. తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వచ్చిన నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని వరికూటి అశోక్‌బాబు హామీ ఇచ్చారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు తప్పవు



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీధర్

తెనాలిరూరల్: ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం గురించి న్యాయ అవగాహన సదస్సు శనివారం సాయంత్రం తెనాలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. శ్రీధర్ మాట్లాడుతూ లైంగిక ప్రయోజనాల కోసం కార్యాలయాల్లో వేధింపులకు గురిచేయడం, అభ్యర్థించడం, అశ్లీల చిత్రాలు చూపడం వంటి పలు విషయాలు వేధింపులుగా పరిగణించబడతాయని వెల్లడించారు. ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాక పని ప్రదేశాలలో అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఫిర్యాదులు దాఖలు చేయడానికి విధివిధానాలు అమలు చేయాలని, దర్యాప్తు ప్రక్రియలు పాటించని వారికి జరిమానాలు, శిక్షలు విధించమని చట్టం నిర్దేశిస్తుందని న్యాయమూర్తి తెలియజేశారు.

చెత్త సేకరణలో లోపాలు లేకుండా చూడండి

తెనాలిఅర్బన్: చెత్త సేకరణలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. పట్టణంలోని 3వ వార్డులో శనివారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో మూడు బుట్టల విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా తడి, పొడి, హానికర చెత్తను వేర్వేరుగా అందజేయాలని సూచించారు.

తెనాలి సబ్ జైలు మూసివేత

త్వరలో రూ.3.30కోట్లతో నూతన భవన నిర్మాణం ప్రారంభం



శిథిలావస్థకు చేరుకున్న సబ్‌జైలు భవన సముదాయం

తెనాలిరూరల్: తెనాలి సబ్‌జైలును అధికారులు శనివారం మూసివేశారు. సబ్‌జైలు భవన సముదాయం శిథిలావస్థకు చేరుకోవడంతో అధునాతన భవనాన్ని నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో జైలులో ఉన్న ముగ్గురు మహిళా ఖైదీలను గుంటూరు జైలుకు, 23 మందిని రేపల్లె సబ్ జైలుకు, 10 మందిని బాపట్ల సబ్ జైలుకు తరలించారు. ప్రస్తుతం ఉన్న సబ్ జైలును బ్రిటీష్ పాలకులు 1912లో నిర్మించారు. శిథిలావస్థకు చేరుకున్న భవన సముదాయంలోనే ఖైదీలు ఉంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జైళ్ల సంస్కరణపై దృష్టి సారించింది. ఈ క్రమంలో సుమారు 110 ఏళ్ల క్రితం నిర్మించిన తెనాలి సబ్ జైలు స్థానంలో అధునాతన సౌకర్యాలతో కూడిన జైలును నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో జైళ్లశాఖ డీజీ హసన్ రెజా తెనాలి జైలును గతేడాది సెప్టెంబరులో పరిశీలించారు. ఈమేరకు రూ.3.30 కోట్లతో నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అన్ని అనుమతులు లభించాయి. ఈ నేపథ్యంలో సీనియర్ ఐపీఎస్ అధికారి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, ఇన్‌చార్జి డీజీ(జైళ్ల శాఖ) హరీష్‌కుమార్ గుప్తా నవంబర్ 29వ తేదీన శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఉన్న సబ్‌జైలుకు అవకాశం ఉన్నమేర అదనంగా కొంత స్థలాన్ని సమకూర్చి దేశంలోనే మోడల్ జైలుగా తెనాలి సబ్‌జైలు నిర్మాణం జరపాలని అధికారులు భావిస్తున్నారు. మరి కొద్దిరోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

అర్హులంతా ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

ఆర్డీవో హెలా షారోన్



నాయకులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో

రేపల్లె రూరల్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలోని తప్పొప్పుల సవరింపులు చేస్తున్నట్లు ఆర్డీవో హెలా షారోన్ అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో శనివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యేంత వరకు ఓటర్ల నమోదుకు దరఖాస్తుల స్వీకరణతో పాటు తప్పొప్పుల సవరణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. రాజకీయ పార్టీల నాయకులు సైతం ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అంతర్గత నైపుణ్యాలను వెలికితీయాలి

ఎంఈవో జి.శేషుగోపాల్



ఈవీఎం ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎంఈవో, నిర్వాహకులు

వెల్లటూరు(భట్టిప్రోలు): విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలను వెలికి తీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని నిజాంపట్నం ఎంఈవో జి.శేషుగోపాల్ పేర్కొన్నారు. ఏపీఎస్ఎస్‌టీఎఫ్ ఫోరం ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని శనివారం భట్టిప్రోలు మండలం వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోషల్ స్టడీస్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో శేషుగోపాల్ మాట్లాడుతూ ఒక్కో విద్యార్థిలో ఒక్కో ప్రతిభ ఉంటుందని దానిని గుర్తించి వారిని ప్రోత్సహిస్తే ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని తెలిపారు. ఎగ్జిబిషన్‌లో భాగంగా ఎలక్షన్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం), భారత పార్లమెంట్, భట్టిప్రోలు బౌద్ధ స్తూపం, ఎర్రకోట, భారత న్యాయ వ్యవస్థ, బ్యాంకింగ్, చంద్రయాన్-3, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్, కుతుబ్‌మీనార్ల నమూనాలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. ఏపీఎస్ఎస్‌టీఎఫ్ వ్యవస్థాపకులు, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ గుర్రం మురళీమోహన్, ఎస్‌కె సుభానీల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో బాలుర విభాగంలో ఎలక్షన్ ఓటింగ్ మిషన్, చంద్రయాన్ రోవర్, ఇండియన్ పార్లమెంట్ మోడల్, చంద్రయాన్-3 ప్రాజెక్టులు బహుమతులకు ఎంపికయ్యాయి. బాలికల విభాగంలో సేవ్ గర్ల్ చైల్డ్, పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, ఋతువులు, సోలార్ పవర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు బహుమతులు సాధించాయి.

పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష



మోడల్ పరీక్షకు హాజరైన విద్యార్థులు



మోడల్ పరీక్ష పత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

బాపట్ల అర్బన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా మోడల్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు విద్యా సంస్థల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య మాట్లాడుతూ మార్చి 18 నుంచి రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నందున ప్రముఖ విద్యావేత్త ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పర్యవేక్షణలో సబ్జెక్టులో నిష్ణాతులైన వారితో వంద మార్కుల ప్రశ్నా పత్రాన్ని తయారు చేసినట్లు వెల్లడించారు. విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించేందుకు ఈ మోడల్ పరీక్ష ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. బాపట్ల పట్టణంలో వెయ్యి మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారని, పరీక్ష అనంతరం పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులతో పాటు ప్రశంస పత్రాలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కళ్యాణ్ చక్రవర్తి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ పరీక్ష నిర్వహణ

భట్టిప్రోలు: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ), ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటీఎఫ్), జనవిజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో శనివారం భట్టిప్రోలు మండలంలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.మనోజ్‌కుమార్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు పరీక్షా విధానంలో చేసిన మార్పులను, వారిలో ఉన్న ఫోబియాను తొలగించేందుకు ఈ మోడల్ పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో వంద ప్రశ్నలతో కూడిన ప్రశ్నా పత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 560 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వశాంతి, సిద్ధార్థ హైస్కూల్ హెచ్ఎంలు ఫణి పార్థసారథి, వి.భారతి, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్యామ్, శివ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ పోటీల్లో మెరిసిన బాపట్ల విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

బాపట్ల అర్బన్: బాపట్ల జిల్లాకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ప్రతిభ పోటీ పరీక్షల్లో తమ సత్తా చాటారు. శనివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ చేతుల మీదుగా వీరికి నగదు బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించేందుకు ఎడ్యుకేషనల్ ఎపిఫనీ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న 'ఈఈఎంటీ-2024' (ఎడ్యుకేషనల్ ఎపిఫనీ మెరిట్ టెస్ట్) పరీక్ష తోడ్పడుతుందన్నారు. విజేతలకు బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి కే.నారాయణ రావు, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్ తదితరులు అభినందించారు.

పదో తరగతి విభాగంలో బల్లికురవ జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన చెన్నాప్రగడ సత్యసాయి జతిన్ ప్రథమ స్థానం, మార్టూరు మండలం బొబ్బేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన బత్తుల వెన్నెల ద్వితీయ స్థానం, నగరం మండలం ఉల్లిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్‌కు చెందిన పాటి జ్యోతిరా సాయి మూడో స్థానం సాధించారు. ఏడో తరగతి విభాగంలో వేటపాలెం మండలం పందిళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన బట్ట లలిత సాయి ప్రథమ స్థానం, బల్లికురవ మండలం కొప్పెరపాడు హైస్కూల్‌కు చెందిన బొంతు భగత్, లక్ష్మీ అమూల్యలు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు.